క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: మండల పరిధి నజీరాద్‌లోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ ఖాజా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు పరిగి పట్టణంతో పాటు మండల పరిధి మొత్తంగా సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

తాండూరులో..

తాండూరు: సబ్ డివిజన్ పరిధి తాండూరు మండలం.. పెద్దేముల్, తాండూరు మండలాలతో పాటు మున్సిపాలిటీలోని సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా గురువారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏడీఈ ఆదినారాయణ తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘కొండా’ గెలుపు ఖాయం

యాలాల: ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ కార్యదర్శి, దేవనూరు శివకుమార్ ధీమా వ్యక్తంచేశారు. మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని దేశ ప్రజలు మరోసారి కోరుకుంటున్నారని తెలిపారు.

30లోగా దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: 2024–25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశానికి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ డెవెలప్‌మెంట్ జిల్లా అధికారి మల్లేషం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులు.. తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంబంధిత ధృవపత్రాలతో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం పదో తరగతిలో జీపీఏ 7.0 ఆ పైన సాధించిన విద్యార్థులే అర్హులని తెలిపారు. కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో, బెస్ట్ అవైలబుల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో చదివిన వారు తమ పేర్లను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వెల్లడించారు.

తాండూరు ప్రజలకు కృతజ్ఞతలు

తాండూరు: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలికిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నరేష్ మహరాజ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ స్థానం ఏర్పడిన నాటి నుంచి బీజేపీని ప్రజలు ఇంతలా ఆదరించలేదన్నారు. తాండూరుతో పాటు వికారాబాద్, పరిగి ఓటర్లు బీజేపీ వైపే నిలిచారని పేర్కొన్నారు. ప్రజాదరణతో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

నందనవనాన్ని తలపించేలా..



పచ్చదనంతో కళకళలాడుతున్న మండల పరిషత్ కార్యాలయ ఆవరణ

షాబాద్: షాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతోంది. వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగి ప్రజలకు నీడతో పాటు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కార్యాలయ ఆవరణలో ఎనిమిది సంవత్సరాల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల మొక్కలు నాటారు. అప్పటి ఎంపీడీఓ పద్మావతి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ.. సిబ్బందితో ప్రతిరోజూ ఉదయం , సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు పోయిస్తున్నారు. దీంతో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి, కార్యాలయానికి వచ్చే మండల ప్రజలకు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కొన్ని మొక్కలు చక్కని ఫలాలను కూడా ఇస్తున్నాయి. కార్యాలయంలో నాలుగు సంవత్సరాల క్రితం నాటి జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి నాటిన మామిడి మొక్క.. ప్రస్తుతం ప్రజలకు మామిడికాయలు అందిస్తోంది.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

మొయినాబాద్‌రూరల్: యువత అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అంబేడ్కర్ కన్‌స్ట్రక్షన్ సంఘం మండల చైర్మన్ యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధి హిమాయత్‌నగర్ గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు ఆ సంఘం ఆధ్వర్యంలో యాదయ్య దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్య, ఉద్యోగంతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని వెల్లడించారు.

ష్.. లాభం లేదు

- సాగు చేయడం కంటే.. విక్రయించడమే కష్టం
- ఆందోళన వ్యక్తంచేస్తున్న అన్నదాతలు
- ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ఎదురు చూపులు



పంట పొలాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి కుప్పలు

‘పంటలు పండించడం ఒకెత్తు, చేతికందిన దిగుబడిని విక్రయించడం మరో ఎత్తు. ఆరుగాలం ఇంటిల్లి పాది చమటోడ్చినా.. చివరకు శ్రమే మిగులుతోంది. సాగు చేసిందాంట్లో లాభం లేదు’ అని అన్నదాతలు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దేముల్: అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రం లేక ఇబ్బంది పడుతున్నామని, మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. సమయానికి గోనె సంచులు అందక, తూకం వేయక, లారీలు రాక ఇబ్బందులు తలెత్తున్నాయని పేర్కొంటున్నారు. ఏటా ఇవే సమస్యలు తలెత్తుతున్నాయని, తమ గోడు వినేవారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. సాగు చేయడం కంటే, విక్రయించడమే కష్టంగా మారిందని పెద్దేముల్, బుద్దారం, తింసాన్‌పల్లి గ్రామాల అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

క్వింటాకు రూ.300 నష్టం

గతంలో డీసీఎంఎస్, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం, ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఉండేవని, రెండేళ్లుగా స్థానిక సహకార సంఘం అధికారులు కొనుగోళ్లు నిలిపి వేశారని పేర్కొన్నారు. సంచులు అందక, కొనుగోలు కేంద్రాలు లేక అవస్థలు పడుతున్నామని వెల్లడించారు. విధిలేక ధారూరు, తాండూరు మార్కెట్‌ల్లో విక్రయించగా.. క్వింటా వరికి రూ.300 వరకు నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కేంద్రాలు అందుబాటులో ఉంటే మద్దతు ధర దక్కేందంటూ వాపోతున్నారు.

పొలాల్లోనే రాశులు..

ప్రభుత్వ ధర రూ.2,200లకు పైగా ఉంటే, మార్కెట్లో అదే ధాన్యాన్ని రూ.1,900 నుంచి రూ.1,920వరకు దళారులు కొనుగోలు చేయడంతో నష్ట పోతున్నామని రైతులు చెబుతున్నారు. వరి కోతలు మొదలయ్యాయని, ఎన్నికల సమయంలో అధికారులు అందుబాటులో లేక సంచులు అందక పంట పొలాల్లోనే ధాన్యం కుప్పలుగా పోసి, కాపాలా కాయాల్సి వస్తోందని, వర్ష వస్తే అసలుకే ఎసరు వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఖరీఫ్‌కు సిద్ధం

పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు

అడపా దడపా కురుస్తున్న చిరు జల్లులతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. సాగుకు అనుకూలంగా ఉన్న భూములను చదును చేస్తున్నారు. మండల పరిధి 30 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 44వేల వరకు సాగు భూమి ఉంది. అందులో ఏటా 20 నుంచి 21వేల ఎకరాల వరకు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా పత్తి, కంది, చెరుకుతో పాటు వరి పంటలను రైతులు అధికంగా సాగుచేస్తున్నారు. రెండేళ్ల నుంచి అధిక వర్షాలు కురవడంతో పంట దిగుబడి తగ్గింది. నాడు పత్తి పంట క్వింటాకు రూ.9,500 నుంచి రూ.10వేల వరకు మార్కెట్లో ధర పలకడంతో రైతులు తెల్ల బంగారానికి మొగ్గు చూపుతున్నారు. దానికి తోడు డీజిల్ ధరలు నానాటికీ పెరగడంతో దుక్కులు దున్నేందుకు ఉపయోగించే ట్రాక్టర్ల అద్దె కూడా పెరుగుతోంది. ఎకరా పొలంలో తిప్పటానికి రూ.800 నుంచి రూ.1000లు తీసుకునే వారు. ప్రస్తుతం అది రూ.1,200 వరకు పెంచారని అన్నదాతలు తెలిపారు. కాడెద్దు తగ్గడంతో ట్రాక్టర్ల వినియోగం పెరిగి, డిమాండ్ పెరగడం గమనార్హం.

ఆదమరిస్తే అంతే..

- దారి పొడవునా గోతులే
- అధ్వానంగా కమాల్‌పూర్–బాగాయిపల్లి రోడ్డు
- కోతకు గురైన సైడ్ బర్మ్‌లు
- ప్రమాదాల బారిన వాహనదారులు



నాగసముందర్ సమీపంలో రోడ్డు దుస్థితి

యాలాల: సుమారు ఐదు కిలో మీటర్లు ఉన్న ఒక వరుస రోడ్డులో.. దారిపొడవునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణమంటే వాహనదారులు, ప్రయాణికుల వెన్నులో వణుకు పుడుతోంది. ఏ మాత్రం ఆదమరచినా ఆస్పత్రి పాలు కావాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. యాలాల మండల పరిధి కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు 5 కి.మీ. రోడ్డు పూర్తిగా గోతులు ఏర్పడి, ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్అండ్‌బీ పరిధిలోకి వచ్చే ఈ రహదారిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో.. మరింత ప్రమాదకరంగా మారుతోంది.

డబుల్‌కు మోక్షం ఎప్పుడో!

తాండూరు నుంచి కమాల్‌పూర్ గేటు వరకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి రాస్నం వరకు సింగిల్ రోడ్డు, బాగాయిపల్లి చౌరస్తా నుంచి ముద్దాయిపేట వరకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉంది. కాగా తాండూరు నుంచి బాగాయిపల్లి, ముద్దాయిపేట మీదుగా నగరానికి వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అయితే కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు దెబ్బతిన్న సింగిల్ రోడ్డుతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు వాపోతున్నారు. ఈ సమస్య వర్షాకాలంలో మరింత ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు సింగిల్ రోడ్డు సైడ్ బర్మ్‌లు పూర్తిగా కోతకు గురి కావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతు లేదా కొత్తగా బీటీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బాగాయిపల్లి రోడ్డు దుస్థితి

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

మంచాల: మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రిన్సిపాల్ తిరుపతయ్య అన్నారు. బుధవారం మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఆరుట్ల, మంచాల గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. మా కళాశాలలో చేరాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఉన్నతమైన బోధనతోనే అత్యున్నత ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాలను పరిశీలన చేసి, మీ పిల్లలను మా కళాశాలలో చేర్పించాలని కోరారు. నాణ్యమైన విద్యను అందించి, మీ పిల్లలకు మంచి భవిష్యత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొంది.



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

విద్యార్థికి అభినందన



ప్రేమ్‌కుమార్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

కందుకూరు: నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన కందుకూరులోని శ్రీచైతన్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఊటు ప్రేమ్‌కుమార్‌కు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ద్వారా మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆర్థికసాయం చేశారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు చెందిన విద్యార్థి ఊటు ప్రేమ్‌కుమార్ పూణేలో నిర్వహించనున్న నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. బాక్సింగ్ కోచ్ మల్లేశ్ ద్వారా విషయం తెలుసుకున్న సత్తినేని వెంకట్రామిరెడ్డి బుధవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ విద్యార్థిని అభినందిస్తూ అతనికి అవసరమైన ఖర్చులను భరించడానికి కేఎల్ఆర్ ముందుకొచ్చారు. విద్యార్థి తరపున ఆ ఈవెంట్‌కు అయ్యే పూర్తి ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబీకులు కేఎల్ఆర్‌తో పాటు జెడ్పీటీసీ జంగారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సురసాని వీరారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బొమ్మకూరి ప్రశాంత్‌కుమార్, ఎగ్గిడి జగదీశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యానికి మించి రవాణా

పొంచి ఉన్న ప్రమాదం

కొందుర్గు: టిప్పర్లలో పరిమితికి మించి కంకర తరలించడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్ల నిండుగా కంకర తీసుకెళ్లడంతో రోడ్డుపై పడుతుందని వాపోతున్నారు. టిప్పర్ సమీపంలో వెళ్లే కార్లు తదితర వాహనాలపై కంకర పడటంతో వాహనాల అద్దాలు పగిలిపోతున్నాయని పేర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిపై కంకరపడితే గాయపడే ప్రమాదముందని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంకర తరలిస్తున్న టిప్పర్

ఎవరి ధీమా వారిదే

- గెలుపోటములపై విస్తృత చర్చ
- విజయం తమదేనంటున్న ప్రధాన పార్టీల నేతలు



చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం

పరిగి: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతాయన్న చర్చ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో విస్తృతంగా జరుగుతోంది. పార్టీల అభ్యర్థులతో పాటు, ఏ చోట నలుగురు గుమికూడి ఉన్నా ఇదే అంశంపై మాట్లాడుకుంటున్నారు. ఏ ఊరిలో ఎంత మెజార్టీ వస్తుందని ఆరాతీస్తూనే.. లెక్కలు కడుతున్నారు. అంచనాలు వేసుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తున్నారు.

బరిలో 43 మంది

చేవెళ్ల పార్లమెంట్ బరిలో 43 మంది ఉన్నారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే గట్టి పోటీ ఉంది. అయినప్పటికీ.. బలాబలాల గురించి అన్ని పార్టీ నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. నియోజకర్గంలోని గ్రామాల పరిధిలో ఎంత మేర ఓటరు శాతం నమోదైంది, ఏఏ పార్టీలకు ఎంత శాతం వస్తుందనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించుకుంటున్నారు.

ఎవరి ధీమా వారిదే..

పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాలు (పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్, మహ్మదాబాద్) ఉండగా.. 2,66,566 మంది ఓటర్లు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 1,78,635మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. 67శాతం పోలింగ్ నమోదు అయింది. వాటిపై ప్రధాన పార్టీలు మూడు అంచనాలు వేసుకుంటున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పెద్దలు పోస్టుమార్టం చేసి, ఏఏ మండలాల్లో ఏ పార్టీకి ఎంత మెజారిటీ వస్తుందనే లెక్కలు వేసుకుంటున్నారు. తామంటే తామే గెలుస్తామని ప్రకటిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పరిగిలో 17వేల ఓట్లు రాబట్టి, అధికార కాంగ్రెస్‌కు గట్టిపోటీనిచ్చింది. దీంతో చేవెళ్ల పార్లమెంట్‌లో కమలం పార్టీనే కాషాయ జెండా ఎగురు వేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

స్టీరింగ్ వదిలేసిన బీఆర్ఎస్!

పరిగిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచారు. లోక్‌సభ ఎన్నికల్లో అంతకు మించి ఓట్లు వస్తాయనే ధీమాలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. నాడు గట్టి పోటి ఇచ్చి, రెండో స్థానంలో ఉన్న బీఆర్ఎస్.. ఈ ఎన్నికల్లో ఎక్కడా తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయలేదని తెలుస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల ఓట్లు.. క్రాస్ ఓటింగ్ జరిగిందని, మొత్తం ఓట్లు గంపగుత్తగా బీజేపీ వైపు మళ్లాయని, అధికార పార్టీకి ధీటుగా పరిగిలో ఎక్కువ ఓట్లు వస్తాయని కమలనాథులు చర్చించుకోగా.. కారు ఓట్లు ఎటు వైపు మళ్లితే, ఆ పార్టీ పరిగి నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లతో ముందు వరుసలో ఉంటుందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఏది ఏమైనా, ఎవరెన్ని లెక్కలు వేసినా.. ఓటింగ్ యంత్రాల్లో దాగున్న అభ్యర్థుల భవితవ్యం జూన్ 4వ తేదీన వెలువడనుంది. అప్పటి వరకు వేచి చూడాల్సిందే.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

షాద్‌నగర్‌రూరల్: పదో తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా నీల సిరివర్ష అనే విద్యార్థి 479 మార్కులతో 95.8శాతం సాధించి టౌన్ టాపర్‌గా నిలిచింది. అదే విధంగా హనితేజ 94శాతం మార్కులు, అభినవ్‌రెడ్డి 92శాతం మార్కులు, ముకేశ్ 90శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పడకేసిన ‘ప్రత్యేక’ పాలన

- జీపీల్లో అందుబాటులో ఉండని అధికారులు
- విధులకు డుమ్మాకొడుతున్న పంచాయతీ సెక్రటరీలు
- అధ్వానంగా మురుగునీటి కాల్వలు



తాళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారికి మూడు, నాలుగు పంచాయతీలు అప్పగించడం, వారు గ్రామాల్లో చుట్టపు చూపుగా పర్యటిస్తుండడంతో సమస్యలు పెరుగుతున్నాయి. తాగునీటి వసతి, చేతిపంపులు మరమ్మతులకు నోచుకోకపోవడం, మిషన్ భగీరథ లీకేజీలు, పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవవడంతో ప్రజలు సతమతమవుతున్నారు.

విధులకు డుమ్మా..

జిల్లాలో 508 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి చివరన పాలక వర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి 2న ప్రత్యేకతకు ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో అధికారికి మూడు నాలుగు జీపీల బాధ్యతలు అప్పగించింది. అయితే వారికి నిత్యం పంచాయతీల్లో రోజువారీగా పర్యవేక్షించడం సాధ్యం కావడం లేదు. కనీసం వారానికి ఒకసారైనా పర్యటించలేకపోతున్నారు. కొన్ని జీపీల్లో స్పెషల్ ఆఫీసర్ల జాడేలేదు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతున్నారు. కొంతమంది వారానికి ఒకరోజు మాత్రమే హాజరవుతున్నట్లు సమాచారం. జీపీ కార్యదర్శులపై అజమాయిషీ లేకపోవడమే అందుకు కారణంగా పేర్కొంటున్నారు. పాలకవర్గం ఉన్నప్పుడు సక్రమంగా విధులకు హాజరయ్యే అధికారులు.. ఇప్పుడు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ..

పంచాయతీల్లో మురుగునీటి కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. పర్యవేక్షణ లేకపోవడమే అందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురికి కాల్వల్లో చెత్తాచెందారం పేరుకుపోయి దుర్గంధం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తరలించడానికి ఖరీదు చేసిన ట్రాక్టర్లు వారానికి రెండురోజుల మాత్రమే షెడ్ నుంచి బయటకు వస్తున్నాయని చెబుతున్నారు. దోమల వ్యాప్తితో రాత్రీపగలు కంటి మీద కునుకులేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు.

అంధకారంలో గ్రామాలు..

కొన్ని గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదు. రాత్రి వేళ గ్రామం అంధకారంలో కూరుకుపోతోందని, చీకట్లో బయటకు వెళ్లడానికి ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు.

రెండు నెలలు గడుస్తున్నా..

ప్రత్యేక అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. బాధ్యతలు చేపట్టి రెండునెలల గడుస్తున్నా.. గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ ఎవరో తెలియ దుస్థితి నెలకొంది. అయితే జీపీ కార్యదర్శుల వద్దకు సమస్యను తీసుకెళ్లినా వారు మాత్రం ప్రత్యేక అధికారుల పేరు చెబుతూ తప్పుకుంటున్నారని పేర్కొంటున్నారు. ప్రత్యేక అధికారుల విషయంపై ఎంపీడీఓ అపర్ణను వివరణ కోరగా.. అందరూ ఎన్నికల డ్యూటీలో ఉండడంతో గ్రామాల్లో పర్యటించలేకపోయామని, ఇప్పటినుంచి కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. త్వరలోనే గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. అందుబాటులో లేని అధికారులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

గాలి వీచిందా.. కరెంట్ గోవిందా

- ఓవర్ లోడ్‌తో తరచూ అంతరాయం
- సమస్యను ఎదుర్కొంటున్న పది గ్రామాల ప్రజలు



దౌల్తాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్

దౌల్తాబాద్: చిన్నపాటి గాలులకే విద్యుత్ సరఫరాలో తరచూ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలా పోయిన కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి. దీంతో సబ్‌స్టేషన్ పరిధి ప్రాంత వినియోగదారులకు కరెంటు కష్టాలు నిత్యకృత్యంగా మారాయి. మండలంలో 33 పంచాయతీలు, 10వరకు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. దౌల్తాబాద్, బాలంపేట, సురాయిపల్లి, నర్సాపూర్ గ్రామాల్లో 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్లలో తరచూ లోడ్ పెరిగి, విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. అయితే గోకఫసల్‌వాద్ ఫీడర్‌కు దౌల్తాబాద్ సబ్‌స్టేషన్ నుంచి కరెంట్ సరఫరా అవుతోంది. ఈ ఫీడర్ దౌల్తాబాద్‌కు సుమారు 10 కిలో మీటర్ల మేర దూరం ఉంది. ఈ మధ్యలో 5 గ్రామాలు, పలు తండాలు ఉన్నాయి. ఎక్కడైనా విద్యుత్ సమస్య ఏర్పడితే దౌల్తాబాద్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో ఈ మధ్యన ఉన్న అన్ని గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సెస్ అధికారులు స్పందించి మరో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఒక్క సబ్‌స్టేషన్ పరిధిలో 10 గ్రామాలు

మండల పరిధి గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, పోల్కంపల్లి, నంద్యానాయక్‌తండా, నందారం, దేశాయిపల్లి, యాంకి, గుముడాల, అల్లాపూర్, తిమ్మాయిపల్లి గ్రామాలకు కలిపి ఒకటే 33/11 కెవి సబ్‌స్టేషన్ దౌల్తాబాద్‌లో (గోకఫసల్‌వాద్ ఫీడర్) ఉంది. దీని నుంచి వ్యవసాయ బావులు, బోర్లు, క్రషర్లు, ఇటుక బట్టీలు, ఐదు రైస్ మిల్లులు, ఫౌల్ట్రీ ఫామ్‌లకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీని వలన సబ్‌స్టేషన్‌పై అధిక భారం పడి, సరఫరాలో అంతరాయం కలుగుతోందని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు

శంకుస్థాపనకే పరిమితం

గోకఫసల్‌వాద్ గ్రామ శివారులో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నాటి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత దాని గురించి ఎవరూ పట్టించుకోలేదని గ్రామ ప్రజలు ఆరోపించగా.. ఎన్నికల కోడ్ కారణంగా నిధులు మంజూరు కాలేదని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రాతినిథ్యం వహిస్తుండగా.. సబ్‌స్టేషన్ సమస్య పరిష్కరించాలని పరిసర ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు.

రైతుల కష్టాలు తీర్చాలి



మండల పరిధి 33 గ్రామాలకు నాలుగు సబ్‌స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. ఓవర్ లోడుతో విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం కలుగుతోంది. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గోకఫస్‌వాద్ ఫీడర్‌కు అదనంగా మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచించి, సమస్యను పరిష్కరించాలి.

– కూర వెంకటయ్య, రైతు, దేవర్‌ఫసల్‌వాద్

‘పెళ్లి కానుక’ అందజేత

మొయినాబాద్: ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లుగానే స్థానిక నాయకులు గ్రామాల్లో సైతం కొత్త కొత్త పథకాలను ప్రవేశపెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తమ సొంత పథకాలను అమలు చేస్తున్నారు. మండల పరిధి మోత్కుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రత్నం ఇటీవల ‘పెళ్లి కానుక’ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆడపడుచుల వివాహానికి రూ.10,116లు కానుకగా అందజేస్తున్నారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఈదుకొళ్ల జంగయ్య కూతురు మాధవి వివాహం బుధవారం జరగడంతో ఆమె వివాహానికి.. మాజీ సర్పంచ్ హాజరై పెళ్లి కానుక అందజేసి, నూతన వధూవరులను ఆశీర్వదించారు.